
జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయండి

ఈనాడు, దిల్లీ: వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నాలుగు రోడ్లను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. మంగళవారం దిల్లీలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. కోకాపేట‌ఓఆర్ఆర్ జంక్షన్-శంకర్‌పల్లి- మోమిన్‌పేట- మార్‌పల్లి- బుధేరపేట, తాండూరు-పెద్దేముల్-కోట్‌పల్లి- మోమిన్‌పేట-సదాశివపేట, వికారాబాద్-మోమిన్‌పేట, మన్నెగూడ-వికారాబాద్-తాండూరు-జహీరాబాద్-బీదర్ రోడ్లను జాతీయ రహదారులుగా మార్చాలని కోరారు. అలాగే నియోజకవర్గంలోని ఏడు రహదారుల మరమ్మతుల కోసం కేంద్ర రహదారుల మౌలిక వసతుల నిధి(సీఆర్ఐఎఫ్) నుంచి రూ.315 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలో చాలా రోడ్లను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఇందు కోసం సీఆర్ఐఎఫ్ నుంచి ఆర్థికసాయం కోరామన్నారు.



కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్. చిత్రంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

ఎఈఓల నియామకం

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: జిల్లాలకు మండల విద్యాధికారులను(ఎంఈఓ) నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లాకు 20 మందిని మండల విద్యాధికారులుగా సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను నియమించారు. ఎంఈఓలు లేకపోవడం, ఉన్న కొద్దిమందికి పని భారం పెరగడంతో జిల్లాలో విద్యా వ్యవస్థ గాడి తప్పుతోంది. వీరి రాకతో సమస్యలు సత్వరం పరిష్కారమై విద్యార్థులకు చదువులు చక్కగా సాగే వీలుంది.

రూ.50లక్షల వ్యయం.. అలంకారప్రాయం



నిరుపయోగంగా విశ్రాంతి గదులు

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తాండూరు పట్టణ శివారులోని మాతా, శిశు సంరక్షణ కేంద్రం ఆవరణలో రూ.లక్షలు పోసి నిర్మించిన నిర్మాణాలు వృథాగా మారాయి. వాటిని ఉపయోగంలోకి తేవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి.

రూ.50లక్షలతో వేచిఉండే గదుల ఏర్పాటు: ఆస్పత్రికి రోగుల వెంట వచ్చే సహాయకులు విశ్రాంతి తీసుకోవటానికి ఆవరణలో రూ.50 లక్షలతో వేచి ఉండే గది నిర్మించారు. దీంతో పాటు క్యాటరింగ్, జనరల్ వస్తువుల విక్రయానికి దుకాణాలు నిర్మించారు. వీటిని గత ఏడాది అప్పటి ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రారంభించారు. నిర్మాణాలు పూర్తయి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికీ తెరుచుకోలేదు. పర్యవసానంగా రోగుల వెంట వచ్చే వారికి ఆసుపత్రి ప్రాంగణమే ఆధారంగా నిలుస్తోంది. పగలు చెట్ల కింద, చుట్టుపక్కల భవనాల వద్ద వేచి ఉంటున్నారు. రాత్రి వేళ నిద్రపోవడానికి మాత్రం తీవ ఇబ్బందులు పడుతున్నారు. భవనాన్ని అందుబాటులోకి తెచ్చి ఉపశమనం కలిగించాలని కోరుతున్నారు.

కాలయాపన.. తప్పని వేదన

సమస్యలకు నిలయంగా రెవెన్యూ కార్యాలయాలు

న్యూస్‌టుడే, పరిగి, పరిగి గ్రామీణ, వికారాబాద్, తాండూరు గ్రామీణ, కొడంగల్, దౌల్తాబాద్, (బొంరాస్‌పేట):

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

ప్రజలకు ఉన్నత సేవలతో చేరువ కావాల్సిన రెవెన్యూ వ్యవస్థ రోజురోజుకూ సమస్యలకు నిలయంగా మారుతోంది. జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పాస్ పుస్తకాలు, ఇతర పత్రాల మంజూరులో తీవ్ర కాలయాపన జరుగుతోంది. పలుచోట్ల పైసలిస్తే గానీ ఫైలు కదలని పరిస్థితి నెలకొందని అర్జీదారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' 'పరిశీలన' కథనం.

ఆదాయానికి లోటు లేదు: జిల్లాలో ఒక్కో మండలంలో రోజుకు 6 నుంచి 8 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రోజువారీగా దాదాపు రూ.8 నుంచి రూ.10 లక్షల ఆదాయం వస్తోంది. ప్రభుత్వానికి ఒక్కో ఎకరా మీద ఛార్జీల కింద రూ.20వేల వరకు రైతులు చెల్లిస్తున్నారు. సేవల విషయంలో మాత్రం వేగం కానరావడంలేదు.

● పరిగి తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం 13 రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో ఎక్కువగా వ్యవసాయానికి సంబంధించినవే ఉంటున్నాయి. కొన్నిసార్లు అధికారులు అందుబాటులో ఉండక పోవడం ఇబ్బంది కలిగిస్తోంది. ● వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో భూముల క్రయ విక్రయాలకు సంబంధించి 12 రిజిస్ట్రేషన్లు మంగళవారం జరిగాయి. మొత్తం 15 మంది ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి నమోదు చేసుకున్నారు. వివిధ కారణాలతో ముగ్గురు రిజిస్ట్రేషన్లు చేయించుకోలేదు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సజావుగా సాగింది.



వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో భూ రిజిస్ట్రేషన్ నిర్వహణ

- జిల్లాలో మండలాలు- 20
- పంచాయతీలు- 566
- రోజుకు జరుగుతున్న రిజిస్ట్రేషన్లు - 140 -160
- ఎక్కువగా పాస్ పుస్తకాల మంజూరు, అనువంశికం.
- ఆస్తి పంపకాలు ● తనఖా పెట్టడం
- దానపత్రాలు ● ఆస్తి మార్పిడి

కొత్త పథకం వస్తున్నందుకే జాప్యం

ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం 'భూమాత' పథకాన్ని త్వరలో ప్రవేశ పెట్టనుంది. ఈ కారణంగా రెండు మాసాలుగా ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న భూముల కొనుగోలుదారులకు కొత్త పాసుపుస్తకాల జారీని నిలిపివేశారు.

– తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వికారాబాద్.

నెలల తరబడి తిరుగుతున్నా..



– మాలతుల్జప్ప, మల్లాపూర్

మా గ్రామం తాండూరు మండలం మల్లాపూర్. మృతి చెందిన నా కుమారుడి పేరిట ఉన్న పీఎఫ్ సొమ్ము పొందాలంటే కుటుంబ సభ్యుల ధ్రువపత్రం సమర్పించాలన్నారు. గత మే 20న దరఖాస్తు చేశా. నాలుగు నెలలు గడిచినా జారీ చేయలేదు. సిబ్బందిని ఆరా తీస్తే దరఖాస్తు పత్రాలు కన్పించడంలేదనీ, నకలు ప్రతులు తీసుకురావాలన్నారు.

మరోమారు చలానా కూడా కట్టా



– అచ్చుగట్ల శ్రీకాంత్, కొడంగల్

కొడంగల్ మున్సిపల్ పరిధిలో 22 గుంతల భూమి గతంలో కొనుగోలు చేశా. మూడు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పాస్ పుస్తకం కోసం తిరుగుతున్నా. ఇటీవల మరో మారు రూ. 300 చలానా కట్టమని చెబితే కట్టాను. పుస్తకం ఎప్పుడిస్తారో తెలియడంలేదు.

● ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదనీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందరికీ అందుతాయని కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.

పిల్లల వైద్యపరీక్షల పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, వైద్యాధికారులు

బొంరాస్‌పేట (కొడంగల్), న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో ఆకార్, ఆశా స్వచ్ఛంద సంస్థలు నెల రోజుల క్రితం దివ్యాంగులైన పిల్లలను గుర్తించేందుకు సర్వే నిర్వహించాయి. అందులో భాగంగా మంగళవారం బొంరాస్‌పేట మండలం కేంద్రంలోని రైతువేదిక భవనంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వీటిని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేలో అంగవైకల్యం, బుద్ధి మాంద్యం ఉన్న పిల్లలను గుర్తించి వారికి కావాల్సిన వైద్య పరీక్షలు చేశారన్నారు. 0--6 సంవత్సరాల వయసు గల పిల్లల్లో 350 మంది పిల్లలకు ఆరోగ్య పరంగా తీవ్ర ఇబ్బంది ఉందని గుర్తించారన్నారు. కలెక్టర్‌తో పాటు డీఎంహెచ్ఓ పల్వన్‌కుమార్, రవీందర్ యాదవ్, స్థానిక వైద్యులు హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేవీ ప్రాజెక్టు ఏర్పాటుతో ముప్పు



క్షేత్ర సందర్శనలో దామగుండం పరిరక్షణ కమిటీ సభ్యులు

పూడూరు, న్యూస్‌టుడే: పూడూరు సమీపంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుతో పర్యావరణానికి, ప్రజలకు తీవ్ర ముప్పు కలుగుతుందని దామగుండం పరిరక్షణ కమిటీ సభ్యులు మంచన్‌పల్లి ఆనంద్ అన్నారు. మంగళవారం స్థానికంగా సందర్శించిన ఆయన దీనిని వ్యతిరేకిస్తూ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల్లో తిరిగి ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజమహేంద్ర వర్మ, చందు, నరేశ్, నవీన్, శ్రీకాంత్ ఉన్నారు.

● నేవీ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన తేదీని ఖరారు చేసేందుకు అధికారులు యోచిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అనధికారికంగా స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, నావికాదళ అధికారులతో కలిసి సందర్శించారు. అటవీ ప్రాంతంలో తిరిగి ఏర్పాట్లపై చర్చించుకున్నారని స్థానికులు తెలిపారు.

ప్రభుత్వ ఆస్తిని కాపాడుతాం

చౌడాపూర్ (కుల్కచర్ల), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆస్తిని కాపాడే బాధ్యత మాదే.. మీరెవరూ ఆందోళన చెందవద్దని ఆర్డీవో వాసుచంద్ర పేర్కొన్నారు. చౌడాపూర్ మండలం లింగంపల్లి పరిధిలోని మ్యాకలోని చెరువు కట్టను కొన్నాళ్ల క్రితం పలువురు ధ్వంసం చేశారు. దీనిపై ఇటీవల చౌడాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో లింగపల్లి గ్రామస్థులు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. దీంతో గ్రామస్థులంతా పాలనాధికారి కార్యాలయం ముందు సోమవారం ధర్నా చేశారు. స్పందించిన ఆర్డీవో వాసుచంద్ర సిబ్బందితో కలిసి మంగళవారం చెరువుకట్టను పరిశీలించారు. అనంతరం గ్రామానికి చేరుకొని స్థానికులతో మాట్లాడారు. కట్ట మరమ్మతులకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటామని తెలిపారు. దీనికి స్పందించిన ఆర్డీవో మాట్లాడుతూ రైతులకు న్యాయం చేస్తామని ఆందోళన వద్దని సూచించారు.

ఆసుపత్రికి దారేటో చెప్పండి



ముందు భాగంలో పాత భవనాలు



రూ. కోట్లతో నిర్మించిన కొత్త భవనం

పెద్దేముల్, న్యూస్‌టుడే: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శాఖలో అనేక మార్పులు చేస్తోంది. నూతన ఆసుపత్రుల నిర్మాణాలు చేపడుతోంది. ఇందులో భాగంగా పెద్దేముల్‌లో ప్రాథమిక ఆరోగ్య భవనం శిథిలావస్థకు చేరడంతో దీని వెనుక భాగంగా రూ.1.5 కోట్లతో కొత్త భవనం నిర్మించారు. అన్ని విభాగాలకు వేర్వేరుగా గదులను నిర్మించారు. రెండు నెలల క్రితం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కొత్త భవనాన్ని ప్రారంభించారు. పాత భవనం ఖాళీ చేసి వైద్య సిబ్బంది దీన్లోకి వెళ్లిపోయారు. అన్ని సేవలు రోగులకు అందుబాటులోకి తెచ్చారు. అయితే కొత్త భవనం కనిపించే విధంగా దారి ఏర్పాటు చేయలేదు. దీంతో రోగులు అయోమయానికి గురవుతున్నారు. ముందు భాగంలో పాతది, ప్రసూతి విశ్రాంతి భవనం, సిబ్బందికి కేటాయించిన మరో భవనం ఉన్నాయి. పాత భవనాన్ని పూర్తిగా మూసి వేశారు. వైద్యం కోసం వచ్చిన రోగులు కొత్త ఆసుపత్రి ఎక్కడ ఉందని అడిగి వెనక వైపు వెళ్లాల్సి వస్తోంది. సరైన దారి ఏర్పాటు చేయాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

భోజనం నాణ్యతగా ఉండాలి



కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఉమాశంకర్ ప్రసాద్

పెద్దేముల్, న్యూస్‌టుడే: మండలంలోని మారేపల్లి గేటు వద్ద గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ మంగళవారం సందర్శించారు. మధ్యాహ్నం సమయంలో విద్యార్థులకు వండి పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యతగా ఉండాలని ప్రత్యేక అధికారి రాజేశ్వరికి సూచించారు. సరకుల నిల్వ గదిలో కూరగాయలు, వంట సరకులను తనిఖీ చేశారు. వంట నిర్వాహకులతో మాట్లాడుతూ నాణ్యతలో తేడా రావద్దన్నారు. ఆయన వెంట తహసిల్దార్ కిషన్ ఉన్నారు.

కంప్యూటర్ నైపుణ్యం నేర్చుకుందాం



కార్యక్రమంలో పాల్గొన్న డిగ్రీ విద్యార్థినులు, అధ్యాపకులు

కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంగళవారం కంప్యూటర్ నైపుణ్యం పెంపొందించుకోవడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యాశాఖ సారథ్యంలో లెర్నింగ్ లింక్ ఫౌండేషన్, డెల్ టెక్నాలజీ సంయుక్త సహకారంతో ఉమెన్ ఎండ్ ఏఐ కార్యక్రమం ద్వారా పలు విషయాలు నేర్పినట్లు ప్రిన్సిపల్ రఫీయాఖానం తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ సంజీవ్, రాంబాబు, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కొడంగల్.



ప్రకృతికి పచ్చదం.. నయన మనోహరం

కనుచూపు మేర చక్కగా ఎదుగుతున్న వరి పైర్లు దారిన వెళ్లే వారిని చూపు తమవైపే నిలిచేలా చేస్తున్నాయి. ఓవైపు వరి పొలాలు, మరోవైపు చెట్లు, గుట్టలతో ఎటుచూసినా ఆహ్లాదకర వాతావరణమే కనిపిస్తోంది. ఈ సుందర దృశ్యాలకు వేదికగా నిలిచింది.. పరిగి మండల పరిధి రాఘవాపూర్ గ్రామం. – న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతు నేస్తంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

ధారూర్: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ధారూర్ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు నేస్తం కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సూచించిన విధంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు సంజు రాథోడ్, సంతోష్, మంజుల, సుజాత, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవాబ్‌పేట: పంటలను అంతర్జాలంలో తప్పకుండా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం చించల్‌పేట గ్రామంలో ఏఈఓ లు చేసిన పంటల నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు.

పోలీస్ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, న్యూస్‌టుడే: శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలు, విషయాలు విధుల్లో ఉన్నంత వరకు ఉపయోగపడతాయని, సమర్థతతో విధులు నిర్వహించి పోలీసుశాఖ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని జిల్లా పోలీసు అధికారి నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం టీజీఎస్‌పీఏలో శిక్షణ పూర్తి చేసుకున్న 17 మంది ఎస్ఐలు క్షేత్రస్థాయిలో జిల్లాలో విధులు నిర్వహించడానికి రాగా, వారితో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరు చేయాల్సిన, చేయకూడని పనుల గురించి అవగాహన కల్పించుకోవాలన్నారు. ప్రజల నుంచి ఏవైనా ఫిర్యాదులు అందితే వెంటనే స్పందించి సేవలు అందించే తత్వాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగాల కంటే పోలీసుల విధులు భిన్నంగా ఉంటాయన్నారు.

గర్భిణి మృతిపై వైద్యాధికారుల విచారణ

వికారాబాద్, వికారాబాద్ మున్సిపాలిటీ: సకాలంలో వైద్య సేవలు అందక వికారాబాద్ మండలం పుల్‌మద్దికి చెందిన గర్భిణి ఈ నెల 19న మృతి చెందడంతో వైద్యాధికారులు మంగళవారం విచారణ చేశారు. వివరాలు ఇలా.. పుల్‌మద్దికి చెందిన జగదాంబ అనే గర్భిణి అనారోగ్యంతో వికారాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. పరిస్థితి విషమంగా మారడంతో తాండూర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యన మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ స్పందించి విచారణకు ఆదేశించారు. విచారణాధికారులుగా ఉప జిల్లా అధికారి డాక్టర్ జీవరాజ్, మాతాశిశు సంరక్షణ కార్యక్రమ అధికారిణి డాక్టర్ పవిత్రలను నియమించారు. వీరు మృతి చెందిన మహిళ చికిత్స పొందిన ప్రైవేటు, తాండూర్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రులను సందర్శించి చికిత్స చేసిన తీరు ఇతర వివరాలు సేకరించారు. దర్యాప్తు నివేదికను జిల్లా వైద్యాధికారికి అందజేయనున్నట్లు విచారణాధికారులు తెలిపారు.

నిరుద్యోగులకు సాయం.. భవితకు ఊతం

కీలకంగా మారుతున్న జిల్లా ఉపాధికల్పనా కార్యాలయం

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్, పరిగి: పట్టణం, పల్లె అనే తేడా లేకుండా రోజురోజుకీ నిరుద్యోగ సమస్య అధికమవుతోంది. దీంతో ప్రతి చిన్న ఉద్యోగానికి లక్షల మంది పోటీ పడుతున్నారు. ఇలాంటి తరుణంలో వీరి ఉపాధికి బాటలు వేసేందుకు కృషి చేస్తోంది జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం. పదో తరగతి ఉత్తీర్ణులైతే చాలు ఉపాధి కార్డు ఇస్తున్నారు. పేరును కార్యాలయంలో నమోదుచేసుకుంటే అధికారులు ఉపాధి కల్పనకు, స్వయం ఉపాధికి తోడ్పాటునిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

- జిల్లా కేంద్రంలోని ఐటీఐ ఆవరణలో ఉపాధి కల్పనా కార్యాలయం ఏర్పాటు.
- ఇప్పటిదాకా నమోదు చేసుకున్న నిరుద్యోగులు: 6200
- గత రెండేళ్లలో నిర్వహించిన : 28
- ఆగస్టు 30 వరకు ఉపాధి పొందిన వారు: 1018 మంది

కార్డు పొందడానికి ప్రత్యేక కౌంటర్

నిరుద్యోగులు ఉపాధి కార్డు పొందటానికి ఈ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో వచ్చి నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో అయితే మీసేవ కేంద్రాలకు వెళ్లి ఎంప్లాయ్‌మెంట్.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించారు. స్మార్ట్‌ఫోన్‌లో కూడా చేసుకోవచ్చు. విద్యార్హత, ఆధార్, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు జతచేయాల్సి ఉంటుంది. తర్వాత కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఒక్కసారి తీసుకుంటే 45 సంవత్సరాలు చెల్లుబాటు


గతంలో మాదిరిగా కాకుండా ఒకసారి కార్డు తీస్తే 45 సంవత్సరాల వరకు చెల్లుబాటులో ఉంటుంది. ప్రతి సంవత్సరం నవీకరణ చేయాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీల సమాచారం జిల్లా ఉపాధి కార్యాలయానికి అందుతుంది. ఉపాధి కార్డు సీనియారిటీ ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తారు. విద్యార్హతలను బట్టి ప్రభుత్వ ప్రైవేట్ ఖాళీలు వివరాలను అభ్యర్థులకు మెయిల్ ద్వారా అందజేస్తారు. విదేశాల్లో ఉన్న ఖాళీల సమాచారాన్ని కూడా తెలియజేస్తారు.



ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

● ప్రతి నెలలో ఒకటి చొప్పున జిల్లాలో ఉద్యోగమేళాలను నిర్వహిస్తున్నారు. వీటిలో ఎస్‌బీఐ కార్డు, ఫ్లిప్‌కార్ట్, పేటీఎమ్, శుభగృహ, అపోలో ఫార్మసీ, అపోలో హెల్త్‌కేర్, ఎల్ఐసీ, టాటా, సెక్యూరిటీ వంటి సంస్థలు పాల్గొంటున్నాయి.

మెగా ఉద్యోగమేళాకు చర్యలు



ప్రతి మూడు నెలలకోసారి నియోజక వర్గం కేంద్రాల్లో మెగా ఉద్యోగమేళాను నిర్వహించటానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం నెలలకు ఒకటి, రెండు చొప్పున జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం ఆవరణంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్క నిరుద్యోగి తప్పని సరిగా పేరును నమోదు చేసుకోవాలి.

– షేక్ అబ్దుస్ సుభాన్, జిల్లా ఉపాధి కల్పనాధికారి, వికారాబాద్.

పోలీస్ చర్యలపై కాంగ్రెస్, భారాస ఆందోళన

మర్పల్లి, న్యూస్‌టుడే: పోలీసుల చర్యలను నిరసిస్తూ మర్పల్లి పోలీస్ ఎదుట కాంగ్రెస్, భారాస నాయకులు మంగళవారం పోటాపోటీ ఆందోళన చేశారు. పట్లూరు గ్రామానికి చెందిన ప్రవీణ్, నవీన్ అనే వ్యక్తులను ఓ కేసు విషయంలో పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చారు. సమాచారం అందడంతో భారసా నాయకులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ డౌన్ డౌన్, స్పీకర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వెంటనే పక్కనే ఉన్న కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన దగ్గరకు వచ్చి పోటా పోటీగా నినాదాలు చేశారు. మోమిన్‌పేట వలయాధికారి నవీన్ కుమార్, ఎస్ఐలు అరవింద్, సురేష్ పోలీస్ సిబ్బంది ఇరు వర్గాలను శాంతింపజేశారు. ఇబ్బందికి గురిచేస్తే సహించేది లేదని భారాస మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. పట్లూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యంకాగా, గుర్తు తెలియని మృత దేహంగాలభ్యమైంది. ఈ విషయమై విచారణకు ప్రవీణ్, నవీన్‌లను పిలిచామని ఎస్ఐ సురేష్ తెలిపారు.

నాచగిరి హుండీ ఆదాయం రూ.11.83 లక్షలు


కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

వర్గల్, న్యూస్‌టుడే: ప్రసిద్ధ నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గడిచిన 75 రోజులకు రూ.11,83,932 వచ్చినట్లు ఈవో అన్నపూర్ణ పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సాయంత్రం వరకు లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు, గౌరారం పోలీసులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు


మాట్లాడుతున్న వీర్‌శెట్టి

టేక్మాల్, న్యూస్‌టుడే: చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని స్వయం శక్తి అగ్రి ఫౌండేషన్ ఛైర్మన్(మిలెట్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ) వీర్‌శెట్టి పేర్కొన్నారు. టేక్మాల్ మండల పరిధిలోని పల్వంచలోని రైతులకు మంగళవారం టేక్మాల్ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో అవగహన కల్పించారు. పల్వంచ, బొడ్మట్‌పల్లి గ్రామాల్లో కొర్ర సాగుద్వారా సేకరించిన ధాన్యాన్ని తీసుకొచ్చి యంత్రంలో నూర్పిడి చేశారు. పలు ధాన్యాల రకాలతో చేసి ఆహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంఘం ఛైర్మన్ మొగులయ్య, సీఈవో వెంకటేశం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అనంతగిరి.. ఆహ్లాద సిరి!

న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ, వికారాబాద్ గ్రామీణ

ఎటు చూసినా పచ్చదనం, కొండలు.. మూసీ నది పరవళ్లు.. మధ్యలో ఆలయం.. ఇవీ అనంతగిరి విశేషాలు. జిల్లా కేంద్రం వికారాబాద్‌కు 6 కి.మీ. దూరంలోని అనంతగిరి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోంది. అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) ఇందుకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వ ఆమోదానికి పంపింది. పచ్చజెండా ఊపడమే ఆలస్యం. మరోవైపు కేంద్రం స్వదేశీ అభియాన్ పథకం కింద రూ.100 కోట్లు మంజూరు చేసింది. తొలి దశలో రూ.38 కోట్లు వచ్చాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది.


అనంతగిరి అడవిలో పర్యాటకులు

అభివృద్ధి ఇలా..

- అనంతగిరి కొండల్లో పర్యటకులు బస చేసేందుకు నాలుగు కాటేజీలను ఆధునికీకరిస్తారు.


గ్రాస్‌ల్యాండ్ ప్రాంతం ఇదే..

డైనింగ్ హాల్ నిర్మించనున్నారు.

- ఇక్కడి గ్రాస్‌ల్యాండ్‌లో పర్యటించేందుకు సఫారీ వాహనం సమకూర్చారు. అక్కడే అల్పాహారం, ఆ తర్వాత ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిస్తూ..

– జ్ఞానేశ్వర్, డీఎఫ్‌వో, వికారాబాద్



అనంతగిరి కొండలపై పర్యావరణం దెబ్బతినకుండా అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. స్వదేశీ అభియాన్ పథకం కింద కేంద్రం అనంతగిరి కొండలను, భువనగిరిని ఎంపిక చేసింది. పర్యాటకానికి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. అనంతగిరికి రూ.100 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తుంది. అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోనూ పలు అభివృద్ధి పనులు కొనసాగనున్నాయి.

80 హెక్టార్లలో అభివృద్ధి..

ప్రతి శని, ఆదివారాల్లో సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది. హైదరాబాద్, ఇతర జిల్లాల నుంచి పర్యటకులు వస్తుంటారు. ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి పనులు పూర్తయి అందుబాటులోకి వస్తే పర్యటకుల సంఖ్య మరింత పెరగడం ఖాయం. ఈ మేర అటవీ శాఖకు ఆదాయం సైతం పెరగనుంది. వసతుల కల్పనకు నందిఘాట్ సమీపంలో 80 హెక్టార్లను గుర్తించారు. ఇక్కడి ఎబ్బనూరు చెరువు ప్రాంతం వరకు అభివృద్ధికి ప్రతిపాదించారు.

- ఔషధ మొక్కలపై అవగాహన కల్పనకు ప్రత్యేక ప్రాజెక్టును సిద్ధం చేస్తున్నారు.
- ట్రీ హౌస్‌లు, టెంట్లలో సందర్శకులు బస చేసేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ఇందుకు రెండు, మూడెకరాలలో వసతులు కల్పిస్తారు.

ప్రత్యేకతలు ఇవీ

- 3800 ఎకరాల్లో అనంతగిరి కొండలు విస్తరించాయి. సముద్ర మట్టానికి 600 అడుగుల ఎత్తులో ఈ ప్రాంతం ఉంది.
- అనంత పద్మనాభ స్వామి కొలువయ్యాడు.
- వెయ్యి ఎకరాలలో 50కి కంటే ఎక్కువ ఔషధ మొక్కలు ఇక్కడ ఉన్నాయి.
- 1946లోనే క్షయ వ్యాధి నివారణ చికిత్సాలయాన్ని నెలకొల్పారు. ప్రస్తుతం ఇందులోనే ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటైంది.

బహిష్కరణ బాధితులకు అండగా అధికారులు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని గౌతోజీగూడెంలో ఓ కుటుంబాన్ని ఈ నెల 10న గ్రామపెద్దలు కుల బహిష్కరించడంపై బాధితుల ఫిర్యాదు మేరకు మనోహరాబాద్ పోలీసులు 31 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు 16 మందిని అదుపులోకి తీసుకోగా, 15 మంది పరారీలో ఉన్నారు. ఈ ఘటనపై ఇటీవల బాధితులు హైకోర్టును ఆశ్రయించగా, చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామంలో కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బాధిత కుటుంబంపై వివక్ష చూపకుండా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బాధితుడి కూతురు పాఠశాల బస్సులో వెళ్లేప్పుడు ఎవరూ మాట్లాడకపోవడం, ఇంటి వద్ద తోటివారు ఆడుకోకపోవడం వంటి ఘటనలతో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నారు. కిరాణా దుకాణంలో సామగ్రి ఇవ్వడం లేదని తెలపడంతో, అలాంటివి జరగకుండా వ్యాపారులకు ప్రత్యేక సూచనలు చేశారు. బాధితులు చంద్రం, అర్జున్, నర్సమ్మ కుటుంబ సభ్యులకు పోలీసులు అండగా నిలిచారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో మనోహరాబాద్ ఎస్సై సుభాష్‌గౌడ్, పోలీసులు ఎప్పటికప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు.

వర్గల్ నవోదయకు 'పీఎంశ్రీ' హోదా

వర్గల్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయానికి పీఎంశ్రీ హోదా దక్కినట్లు ప్రిన్సిపల్ రాజేందర్ పేర్కొన్నారు. పీఎంశ్రీ పథకం ప్రకారం నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం. ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల నుంచి నిధులు సమకూరుతాయని అవసరమైన మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 14 వేల పాఠశాలలు ఎంపిక కాగా అందులో రెండో విడతలో వర్గల్ నవోదయ ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు.

సింగూరు నీటి రాక.. ఆలయం మూసివేత



సింగూరు ప్రాజెక్టు నుంచి సోమవారం దిగువకు నీటిని విడుదల చేయడంతో మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద మంగళవారం వరద ప్రవాహం పెరిగింది. దీంతో తెల్లవారుజామున అర్చకులు మాత్రమే గర్భగుడిలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్ర నామార్చన చేపట్టి మూసివేశారు. భక్తులను అనుమతించలేదు. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు కొనసాగించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వరద ప్రవాహం తగ్గితే బుధవారం ఆలయం తెరిచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 11,000 క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తోంది. - న్యూస్‌టుడే, పాపన్నపేట

క్రీడల్లో ప్రతిభ చూపితే పారితోషికాలు: మంత్రి


ఎల్లమ్మ చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పురాధ్యక్షురాలు రజిత, ఆర్డీవో రామ్మూర్తి

హుస్నాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే పారితోషికాలు అందించి ప్రోత్సహిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని మినీ స్టేడియాన్ని ఆయన సందర్శించారు. స్థానిక ఎల్లమ్మ చెరువులో ఇటీవల నిమజ్జనోత్సవం అనంతరం చేరిన వ్యర్థాలను మంత్రి, అధికారులు, ప్రజాప్రతినిధులు తొలగించే పనిని చేపట్టారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మినీ స్టేడియంలో క్రీడాకారులతో కలిసి 'స్వచ్ఛతా హీ సేవ' ప్రతిజ్ఞ చేయించారు. వారితో మంత్రి మాట్లాడుతూ.. క్రీడా సౌకర్యాలను విద్యార్థులు, ఆటగాళ్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి

మెదక్ టౌన్: ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవనంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రుల్లో సరిపడా వైద్యులను నియమించడంతో పాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దేవయ్య, మల్లేశం, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకొచ్చి.. నీటిని పారించుకొని..


పూడిక తొలగిస్తున్న రైతులు



ఎవరైనా వచ్చి ఏదైనా చేస్తారని ఎదురుచూడలేదు ఆ రైతులు. స్వయంగా తమ సమస్యను పరిష్కరించుకొని సాగు నీటికి ఢోకా లేకుండా చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో నల్ల వాగు పారుతోంది. వాగుపై జలాశయం నిర్మించారు. ప్రధాన కాలువ నుంచి డిస్ట్రిబ్యూటరీ-4 నుంచి వెళ్లే కాలువ ద్వారా బీబీపేట, ఫతేపూర్ గ్రామాల మీదుగా మార్డి వరకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇక్కడి వరకు కుడి కాలువ నిర్మించగా.. బీబీపేట వరకు బాగుంది. ఆ తర్వాత పూడిక పేరుకుపోయి, కాలువ అధ్వానంగా మారడంతో వరద పారని పరిస్థితి.

వందెకరాలలో.. మార్డి గ్రామ పరిధిలో బోరుబావుల కింద వందెకరాలలో వరి సాగు చేశారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉండగా, బోరుబావుల్లో నీటి మట్టాలు తగ్గడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో ఇక్కడి రైతులు ముందుకొచ్చి సాగునీటి సమస్య పరిష్కారానికి పూనుకున్నారు. రూ.1.50 లక్షలు పోగు చేసుకొని 3 కి.మీ. మేర పూడిక తొలగించుకొని కాలువను బాగు చేసుకున్నారు. ఇందుకు రెండు రోజులు శ్రమించారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా కాలువ ద్వారా పొలాలకు నీరందుతోంది. ప్రతి ఏటా నీరు విడుదలకు ముందు నీటిపారుదల శాఖ సిబ్బంది కాలువల్లో పూడిక తొలగించేవారు. ఈ సారి చర్యలు తీసుకోకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా ముందుకురావడం విశేషం.

– న్యూస్‌టుడే, కల్హేర్

చేనేతలో స్వయం ఉపాధికి 'సమర్థ' పథకం


యువతికి పుస్తకాలు, సామగ్రి అందజేస్తున్న చేనేత సేవా కేంద్రం హైదరాబాద్ ఏడీ పుహళేంది

దుబ్బాక, న్యూస్‌టుడే: చేనేత రంగంలో యువతి, యువకులకు నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణ ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధి సామర్థ్యంతో పాటు ఆర్థిక స్వావలంబన పెంపొందించే దిశగా సమర్థ పథకం ఎంతగానో తోడ్పడుతుందని చేనేత సేవా కేంద్రం హైదరాబాద్ ఏడీ ఎస్.పుహళేంది అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని చేనేత సహకార సొసైటీ లిమిటెడ్, దుబ్బాక హ్యాండ్లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌లలో యువతకు 45 రోజుల సమర్థ పథకం శిక్షణను ఆయన ప్రారంభించారు. శిక్షణకు ఉపయోగపడే సామగ్రిని అందించారు. ఆయన మాట్లాడుతూ.. చేనేత రంగంపై ఆసక్తితో యువత నేటి సాంకేతికతను అందిపుచ్చుకొని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి లభిస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు గాజుల భాస్కర్, బోడ శ్రీనివాస్, అధికారులు పవన్ కుమార్, బాలాజీ, సంతోష్‌కుమార్, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జట్టుతో నిర్వాహకులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు 40 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. మంగళవారం మెదక్‌లోని వెస్లీ పాఠశాల మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో బాల, బాలికలకు వేర్వేరుగా ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి బాలురు-161, బాలికలు-86 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన 40 మందిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. అక్టోబరు 3 నుంచి 5 వరకు మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయని, ఈ పోటీల్లో సదరు జట్టు పాల్గొంటుందని ఎస్జీఎఫ్ మెదక్‌జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. నిర్వాహకుడు నాగరాజు, పీడీలు రూపేందర్, సుజాత, శ్రీనివాసరావు, మాధవరెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు, ఉద్యోగుల గొంతుకనవుతా..


మాట్లాడుతున్న డా.నరేందర్‌రెడ్డి తదితరులు

మెదక్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల సాధనకు చట్టసభలో వారి గొంతుకై పనిచేస్తానని కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయాలనుకుంటున్న ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మెదక్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగం రాక.. జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయారని అన్నారు. ఉద్యోగాల ఖాళీల భర్తీకి, డీఏ, ఇంక్రిమెంట్ల సాధనకు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే వారికి ఆరోగ్యకార్డులు, ఫీజు రియంబర్స్‌మెంట్ సకాలంలో అందించేలా కృషి చేస్తానన్నారు. నూతన విద్యా పాలసీ తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, దీనివల్ల ఇంటర్, పదో తరగతి బోర్డులు ఉంటాయా? లేదా? అనే సందేహాలు కలుగుతున్నాయని అన్నారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించేందుకు, సమస్యల పరిష్కారానికి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీగా గెలిచాక సేవకుడిగా ఉంటానని, వేతనాన్ని పేదల విద్యాభ్యాసం, నిరుద్యోగ సంక్షేమనిధి ఏర్పాటు చేసి కేటాయిస్తానని తెలిపారు. ప్రస్తుతం పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. స్నేహ విద్యాసంస్థల బాధ్యులు సత్యనారాయణ, బాధ్యులు ఫణిందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


చిన్నచెల్మెడ అంగన్వాడీ కేంద్రం వద్ద బృందం సభ్యులు

ఐసీడీఎస్ కేంద్ర బృందం పర్యటన

మునిపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధి పెద్దచెల్మెడ, చిన్నచెల్మెడ అంగన్వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ కేంద్ర బృందం అధికారులు పరిశీలించారు. మంగళవారం ఝార్ఖండ్, బిహార్, ఉత్తరాఖండ్, దిల్లీ రాష్ట్రాలకు చెందిన పలువురు అధికారుల బృందం ఆయా గ్రామాల్లో పర్యటించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అభ్యసన అభివృద్ధిపై తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలపై టీచర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు రేణుక, మీనాక్షి ఉన్నారు.

అద్దెకు ఇల్లు కావాలని వచ్చి.. వృద్ధురాలి గొలుసు చోరీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: వృద్ధురాలిని మాటల్లో పెట్టి ఆగంతకుడు గొలుసు లాక్కెళ్లిన ఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు, తెలిపిన వివరాలు.. పట్టణంలోని మాజీ సర్పంచి కోరె ఎల్లయ్య తల్లి సత్తవ్వ (70) మంగళవారం ఇంట్లో కూర్చుని ఉండగా గుర్తు తెలియని యువకుడు వచ్చి ఇల్లు అద్దెకు ఉందా.. అని అడిగాడు. ఆమె లేదని చెప్పడంతో తాగేందుకు మంచినీళ్లు ఇవ్వాలని కోరాడు. ఆమె తెచ్చిచ్చిన నీళ్లు తాగి వెళ్లబోతూ ఒక్క ఉదుటున వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని బయట నుంచి తలుపు గడియ పెట్టి పరారయ్యాడు. ఆమె కేకలకు కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి దుండగుడు పరారయ్యాడు. కుమారుడు ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ ఉపేందర్ చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం


తిరుపతి

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామ పరిధి జాలుబాయితండా సమీపంలో విద్యుదాఘాతంతో గుగులోతు తిరుపతి(25) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. ధూల్మిట్ట మండలం కొండాపూర్ పరిధి జురాలతండాకు చెందిన తిరుపతి పరిసర గ్రామాల్లో ప్రైవేటుగా ఎలక్ట్రికల్ పని చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. మంగళవారం సాయంత్రం నియంత్రిక ఏబీ స్విచ్ ఆపి సరఫరా నిలిపివేసేందుకు యత్నించాడు. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడిని నియంత్రిక వద్దకు ఎవరు పంపారనేది తెలియాల్సి ఉంది. ఎస్సై విజయభాస్కర్ ఘటనా స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. కేసు నమోదైంది. తిరుపతికి వచ్చే నెలలో నిశ్చితార్థం జరగాల్సి ఉంది.

బోరు వద్ద పొదలు తొలగిస్తుండగా వృద్ధుడు..


అంజయ్య

దుబ్బాక: పొలంలోని బోరు వద్ద ఉన్న పొదలను తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురైన వృద్ధుడు మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్సై వి.గంగరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని రఘోత్తంపల్లికి చెందిన గౌరి అంజయ్య (71), ఎల్లవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. పిల్లలందరికీ వివాహాలు అయ్యాయి. సోమవారం రాత్రి పొలం వద్ద మొక్కలు తొలగించేందుకు కొడవలితో కోస్తుండగా ప్రమాదం జరిగింది. కుమారుడు గుర్తించి పరిశీలించగా అంజయ్య అప్పటికే మృతి చెందాడు. కుమారుడు నరేశ్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి


అలీ రెహమాన్

యాలాల: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితి మృతి చెందినట్లు వికారాబాద్ జిల్లా యాలాల ఎస్సై శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. యాలాల పరిధి ఇందిరమ్మ కాలనీకి చెందిన అలీ రెహమాన్ (38), పర్వీన్‌బేగం దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. అలీ రెహమాన్ సామాజిక కార్యకర్తగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అదే కాలనీలో విడివిడిగా ఉంటున్నారు. మూడు రోజుల క్రితం రెహమాన్ ఇంటికి తాళం వేసుకొని నిద్రించాడు. మంగళవారం సాయంత్రం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. అలీ రెహమాన్ విగతజీవిగా కనిపించాడు. భార్య పర్వీన్ బేగం ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చెరువులో పడి వృద్ధుడు..


భూమయ్య

హవేలిఘనపూర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి చెందాడు. మెదక్ జిల్లా హవేలిఘనపూర్ ఏఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మండలంలోని బూర్గుపల్లికి చెందిన గుండమొల్ల భూమయ్య (70) కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ శివారులో ఉన్న శ్రీపతి చెరువు వద్దకు వెళ్లాడు. కాలుజారి చెరువులో పడి ఊపిరాడక మృతి చెందాడు. భూమయ్య ఇంటికి రాకపోవడంతో గ్రామ శివారులో వెతకగా చెరువు వద్ద భూమయ్య చేతి కర్ర, చెప్పులు కనిపించాయి. ఈతగాళ్ల సాయంతో చెరువులో గాలించగా మృతదేహం లభించింది. భూమయ్య కుమారుడు రామానుజన్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకొని తనువు చాలించాడు. జీడిమెట్ల ఎస్సై నాయుడు తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాలకు చెందిన కృష్ణసాయి (23) కొన్ని నెలల క్రితం ఉపాధికి హైదరాబాద్ చింతల్‌కు వలస వెళ్లాడు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పని చేస్తూ.. అక్కడి శ్రీనివాసనగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కొన్నాళ్లుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మంగళవారం తానుంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఆరోగ్య ప్రశస్తి

విద్యార్థుల్లో లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, కంది, పరిగి, నర్సాపూర్

ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పం. ఇందులో భాగంగా పాఠశాల్లో చదువుతున్న పిల్లల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా అని గుర్తించేందుకు సరికొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. బాధితులకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రశస్తి యాప్‌ను విద్యాశాఖ రూపొందించింది. ఉపాధ్యాయులే నేరుగా పిల్లలను పరీక్షించి వారిలో ఉన్న లోపాలను అందులో నమోదు చేయనున్నారు. వాటిని పరిశీలించి ఉన్నతాధికారులు వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటారు.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో విద్యాశాఖ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర విభాగాల పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రశస్తి యాప్‌పై అవగాహన కల్పిస్తోంది. ముందుగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఉపాధ్యాయులు.. పేరు, సర్వీసు నంబరు, మెయిల్ ఐడీ, చరవాణి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థుల పేర్లను నమోదు చేయాలి. దీనికి ఈ నెల 23న ప్రారంభమైన శిక్షణ 25 వరకు కొనసాగనుంది. విద్యార్థులు ఏదైనా ఆరోగ్య సమస్య, అవయవ లోపంతో బాధపడతారు. బయటకు చెప్పుకోలేక ఇబ్బంది పడుతుంటారు. వీరికి మెరుగైన వైద్య సేవలు అందించి సాధారణంగా మార్చడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
సంగారెడ్డి	1,820	2,50,110
సిద్దిపేట	1,845	2,92,200
మెదక్	1,529	2,20,400
వికారాబాద్	1,623	2,39,200


ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న సీఎంవో

64 ప్రశ్నలకు..

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయ్యాక కార్యక్రమం అమలుచేస్తారు. దీన్ని రెండు రకాలుగా విభజించారు. యాప్‌లో అడిగిన ప్రశ్నలకు ఉపాధ్యాయులు కొన్నింటిని పిల్లల నుంచి రాబడతారు. మరికొన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలి.

పార్ట్-1: ఈ నెల 26 నుంచి అక్టోబరు 26 వరకు కొనసాగుతుంది. యాప్‌లో ఉండే 64 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బోధన సమయంలో అందరినీ పరిశీలించాలి. సరిగా చూస్తున్నాడా, గమనిస్తున్నాడా, చదువుతున్నాడా, అవయవ లోపం, వినికిడి లోపం, నత్తిగా మాట్లాడటం, మనోవైకల్యం, అర్థం చేసుకుంటున్నాడా.. ఇలాంటివి ఉంటాయి. ఏది ఉందో గమనించి నమోదు చేయాలి.

పార్ట్-2: అక్టోబర్ 27 నుంచి నవంబరు 14 వరకు దీన్ని కొనసాగిస్తారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు లోపం ఉన్న వారిని పరిశీలిస్తారు. లోపాన్ని గుర్తించి వైద్యులకు సిఫార్సు చేస్తారు. వైద్యులు పరిశీలించి చికిత్స అందిస్తారు.

పకడ్బందీగా అమలు వెంకటేశం, సీఎంవో, సమగ్ర శిక్ష, సంగారెడ్డి

ప్రశస్తి యాప్‌ను పక్బందీగా అమలు చేస్తాం. ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి వివరాలు పక్కాగా నమోదయ్యేలా చూస్తాం. నెల రోజుల పాటు ప్రతి విద్యార్థిని ఉపాధ్యాయుడు బోధన చేస్తూ స్క్రీనింగ్ చేస్తారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 125-00	డ్రెస్డ్ 213-00	
రిటైల్ 147-00	స్కిన్‌లెస్ 243-00	

రోడ్లు, భవనాలకు నిధులు ఇవ్వండి

తాండూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోమవారం రాత్రి మహబూబ్‌నగర్, నకిరేకల్, జడ్చర్ల తదితర నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలతో వెళ్లి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని బహుకరించారు. అనంతరం తాండూరులో చేపట్టే రోడ్లు, భవనాలకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

ఓటరు దరఖాస్తులను పక్కాగా పరిశీలించాలి

మోమిన్‌పేట: ఓటరు జాబితాలో మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు అందించాలని కార్యదర్శులకు ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కాస్లాబాద్, బూర్గుపల్లి, చీమలదరి గ్రామాలలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలు అంగన్‌వాడీ, పూర్వ ప్రాథమిక కేంద్రాలు పంచాయితీ కార్యాలయాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించండి


నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

యాలాల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. మంగళవారం యాలాల మండల కేంద్రలోని మండల పరిషత్ ఆవరణలో లబ్ధిదారులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు నర్సింలు పాల్గొన్నారు.

కల్వర్టులు లేవు.. కష్టాలు తీరవు

రోడ్లపైనే పారుతున్న వరద

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ:

ఇటీవల వర్షాలకు పల్లెల్లో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా ప్రధాన దారుల్లో కల్వర్టులు లేక వాగులు, వంకల నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగడం లేదు. ప్రతి వర్షాకాలంలో ఈ సమస్య ఎక్కువగా ఉన్నా.. అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వీలైనంత త్వరగా నిర్మాణాలు చేపట్టే విధంగా చొరవ తీసుకోవాలని ప్రజలు చెబుతున్నారు.


రాంనగర్ వద్ద తాడుసహాయంతో వాగు దాటుతున్న రైతులు

మచ్చుకు కొన్ని..

● రాంనగర్ నుంచి దాదాపూర్‌కు వెళ్లే దారిలో మూడు చోట్ల కల్వర్టుల సమస్య ఉంది. కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాలకు వాగులు ఉద్ధృతంగా పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు, ప్రజలు రోడ్లు దాటలేని పరిస్థితి. రైతులు తాళ్ల సహాయంతో రోడ్డును దాటారు. ● హీర్యానాయక్ తండా దగ్గర వంతెన ఏర్పాటు చేయించాలి. వర్షాకాలంలో వాగు కాలువల వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఎత్తుకాల్వ తండా నుంచి ఇప్పాయిపల్లికి వెళ్లే దారిలోనూ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో మరీ ఇబ్బందిగా ఉంది. ● చౌడాపూర్ మండలం విఠలాపూర్‌కు వెళ్లే దారిలోనూ చెరువు దగ్గర కల్వర్టు నిర్మాణం లేకపోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● చాకల్‌పల్లి తండా దగ్గర అటవీ ప్రాంతంలో నీటి ప్రవాహం వలన రోడ్డు దెబ్బతింటుంది. అక్కడ ఒక వంతెన ఏర్పాటు చేయిస్తే గిరిజనుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడవు.

● ముజాహిద్‌పూర్ నుంచి పెద్ద ఎల్కిచర్లకు వెళ్లే దారిలో పంట పొలాల నుంచి వచ్చిన నీరు రోడ్డుపైనే నిలిచిపోతోంది.

● దోమ మండలం దిర్సంపల్లి సమీపంలో వాగు దగ్గరా రోడ్డు దాటలేని దుస్థితి. వాగు పారితే రైతులు పంట పొలాలకు దుస్థితి ఏర్పడుతుంది.

సమస్య పరిష్కరిస్తాం

– మహేష్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

కుల్కచర్ల మండలంలో కల్వర్టుల సమస్య ఉందనేది వాస్తవమే. వాటి నిర్మాణాలకు నిధులు రావాల్సి ఉంది. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. నిధులు మంజూరు కాగానే కల్వర్టు నిర్మాణాలు చేపట్టేలా చూస్తాం.

అర్బన్ పార్కు పనులు త్వరితగతిన ప్రారంభించాలి


పార్కు నమూనా మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

న్యూస్‌టుడే, తాండూరు: తాండూరు పట్టణ శివారు అంతారంలో 110 ఎకరాల్లో చేపట్టే అర్బన్ పార్కు పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అటవీ శాఖ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో అటవీ అధికారులతో అర్బన్ పార్కు పనులపై సమీక్షించారు. పార్కు నమూన మ్యాప్‌ను పరిశీలించారు. బషీరాబాద్ మండలం మైల్వార్, జలాల్‌పూర్, నీళ్లపల్లి గ్రామాల పరిధిలో నెలకొన్న సరిహద్దు అటవీ భూ సమస్యను పరిష్కరించే విషయంలో చర్చించారు. కార్యక్రమంలో తాండూరు అటవీ క్షేత్రాధికారి రాజేందర్, సెక్షన్ ఆఫీసర్ పీర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ కల్తీ కారకులను కఠినంగా శిక్షించాలి

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూను కల్తీ చేసిన వాళ్లను కఠినంగా శిక్షించాలని హిందూ పరిరక్షణ సంఘాలు డిమాండ్ చేశాయి. లడ్డూ కల్తీ వ్యవహారాన్ని నిరసిస్తూ తాండూరు పట్టణంలోని భావిగీ భద్రేశ్వర దేవాలయం ప్రాంగణం నుంచి నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పట్లోళ్ల నర్సింలు, విజయలక్ష్మి, రజినీకాంత్, భద్రేశ్వర్, శ్రీనివాస్, వెంకట్, నరేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.75లక్షలతో పట్టణాభివృద్ధి: మున్సిపల్ ఛైర్మన్


మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పరిగి, న్యూస్‌టుడే: పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.75లక్షలను వెచ్చించనున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కౌన్సిలర్ల సహకారంతో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, మంచినీటి సరఫరా వంటి అభివృద్ధి పనులకు 14, 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగిస్తున్నట్లు ఏకగ్రీవ తీర్మానం చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవలసిన అవసరం ఉందని మండల తహసీల్దార్ మురళీధర్ అన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలో గ్యాస్ రాయితీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనందం తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

పోషకాలతో రక్తహీనత దూరం

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే రక్తహీనత సమస్యలను అధిగమించవచ్చని తాండూరు సీడీపీఓ కాంతారావు అన్నారు. తాండూరులోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'పోషణ మాసం' వేడుకలను సహాయ సీడీపీఓ శ్రీలక్ష్మితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..గర్భిణిలు, బాలింతలు, ఆరు సంవత్సరాల్లోపు పిల్లలకు తప్పనిసరి పోషక విలువలున్న భోజనం అందించాలన్నారు. పర్యవేక్షకురాలు నిర్మల, సుశీల, సునీత, మీనాక్షి, జ్యోతి, రాణి పాల్గొన్నారు.



ఉరుములు మెరుపులతో వాన

ధారూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వాన కారణంగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

విశ్వవిద్యాలయం పేరు మార్పు సరికాదు

తాండూరుగ్రామీణ: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చడం సరికాదని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి, భాజపా జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖాపురం ఆంజనేయులు అన్నారు. పొట్టిశ్రీరాములు త్యాగనిరతిని భావితరాలకు తెలియజేయాల్సిన సర్కారు భావితరాలకు తెలపాల్సి ఉందని ఆ ప్రకటనలో తెలిపారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి

మోమిన్‌పేట: అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమకారుడు నవాబ్ రాచిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మోమిన్‌పేటలో మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

కుల్కచర్ల గ్రామీణ: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ముజాహిద్‌పూర్ పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ అన్నారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొదలను తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

భాజపా సభ్యత్వాల నమోదు

తాండూరు: తాండూరు పట్టణం 150వ పోలింగ్‌బూత్ పరిధిలో మంగళవారం భాజపా శ్రేణులు సభ్యత్వాల నమోదు నిర్వహించారు. జిల్లా సభ్యత్వ నమోదు ప్రముఖ్ బంట్వారం భద్రేశ్వర్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్ లావణ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో..

బషీరాబాద్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ అభియాన్‌లో భాగంగా బషీరాబాద్ మండలంలో మంగళవారం మంతట్టి పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రాములు, శ్రీశైలం పాల్గొన్నారు.



కర్రలకు తీగలు.. కరెంటుతో ప్రమాదాలు

ఓగీపూర్, కరణ్‌కోట, సంగెంకలాన్, మల్కాపూర్, కోటబాస్పల్లిలో 300లకుపైగా గనులు ఉన్నాయి. వీటికి రాత్రిపగలూ విద్యుత్తు వినియోగిస్తున్నారు. కొందరు కర్రల ఆధారంగా తీగలను అమర్చారు. కర్రలు విరిగి తీగలు నేలపై పడితే పరిసర గ్రామాల ప్రజలకు, స్థానికులు, కార్మికులకు విద్యుదాఘాత ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ట్రాన్స్‌కో అధికారులు తీగలను సరిచేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ



బోరు వేశారు.. మోటారు మరిచారు!

తాండూరు మండలం జినుగుర్తి ఎస్సీ కాలనీలో నాలుగు నెలల క్రితం బోరు వేయించారు. ఆ తర్వాత మోటారు అమర్చకుండా అధికారులు, నాయకులు మోహం చాటేశారు. దీంతో బోరు నిరుపయోగంగా మారింది. వెంటనే మోటారు అమర్చి తాగునీటి సరఫరా ప్రారంభించి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ



బాబోయ్.. దుమ్ములేస్తుంది

తాండూరు మండలం గౌతాపూర్ నుంచి పట్టణం వరకు జాతీయ రహదారి మార్గంలో విపరీతమైన దుమ్ము వెలువడుతోంది. రహదారిపై గుంతలుపడి దెబ్బతినడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిత్యం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు కరోనా సమయంలో మాదిరి మాస్కులు ధరించి వెళ్తున్నారు.

–న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ

విద్యుదాఘాతంతో రైతుకు ఆర్థిక నష్టం

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన సంఘటన చించల్‌పేటలో చోటు చేసుకుంది. మునగాల రవికి చెందిన రెండు గేదెలను మంగళవారం మేతకు తీసుకెళ్లాడు. అవి మేస్తూ.. నియంత్రిక వద్దకు వెళ్లాయి. అక్కడ కరెంటు తీగల తగలడంతో రెండూ అక్కడికక్కడే మృతి చెందాయి.

పరిగి: తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న బోరు మోటారులో ఒక్కసారిగా మంటలు రేగాయి. దీంతో స్టార్టరు డబ్బా కాలిపోయింది. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ఉదయం పది గంటల సమయంలో మోటారు ఆన్ చేయడంతో ప్రమాదవశాత్తు మంటలు ప్రారంభమయ్యాయి.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

పరిగి గ్రామీణ: బస్సును ఓవర్టేక్ చేయబోయిన ఓ ద్విచక్ర వాహనదారుడు.. అదుపు తప్పి ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటన పరిగి పట్టణ పరిధిలోని తుంకులగడ్డ స్టేజీ పరిసరాల్లో జరిగింది. దోమ మండలం కిష్టాపూర్‌కి చెందిన నరేష్ ద్విచక్ర వాహనంపై పరిగి పట్టణం నుంచి సొంత గ్రామానికి బయలు దేరాడు. దారిలో బస్సు వెళ్తుండగా దాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్ర గాయాలయ్యాయి.

స్వచ్ఛత అందరి బాధ్యత

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: స్వచ్ఛత అందరి బాధ్యతని తాండూరు పురపాలక సంఘం కమిషనరు విక్రమసింహారెడ్డి తెలిపారు. పట్టణంలోని సింధు జూనియర్ కళాశాలలో మంగళవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛతపై కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలరు విజయాదేవి పాల్గొన్నారు.

చెరువు నిండింది.. ప్రమాదం పొంచి ఉంది!



వికారాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: కొంపల్లి చెరువు భారీ వర్షాలకు నిండుకుండలా మారింది. దీన్నే మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తున్నారు. కాస్త జాగ్రత్తగా లేకపోతే స్థానికులు నీటిలో పడే ప్రమాదం ఉందని పలువురు బెంబేలెత్తుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని దాని చుట్టూ కంచె ఏర్పాటు చేస్తే మేలని చెబుతున్నారు. ముఖ్యంగా కొంపల్లి, అత్వెల్లి, కొత్తగడి గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వారం రోజుల క్రితం ఒకరు చెరువు దగ్గరికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి చనిపోయారు. అధికారులు ఈ చొరవ తీసుకొని కంచె ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దేముల్, న్యూస్‌టుడే: గుడుంబా తయారీకి దూరంగా ఉండి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నెల్లిగడ్డ తండాలో గిరిజనులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సహకారం తీసుకొని ఉపాధి అవకాశాలు పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్ తదితరులున్నారు.

వీధిశునకాల తరలింపు



కొడంగల్, న్యూస్‌టుడే: వీధిశునకాల బెడద ఎక్కువగా ఉందని పలుమార్లు ఫిర్యాదులు అందడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ పరిధిలో వాటిని పట్టేవారిని తీసుకొని బోనులో బంధించారు. వాటిని పశువైద్యులు ఆపరేషన్ చేస్తారని మున్సిపల్ అధికారులు తెలిపారు.

గణిత అధ్యాపక పోస్టుల భర్తీకి ఆహ్వానం

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: పాఠశాలలో గణితం బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతిహెప్సీబా ఒక ప్రకటనలో తెలిపారు. గణితం బోధించడానికి ఒక పోస్టు ఖాళీ ఉందన్నారు. అభ్యర్థులు గణితంలో పీజీతో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు.

కష్టపడి చదవండి: ఎంపీడీవో

దోమ: కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీవో మహేష్‌బాబు అన్నారు. మంగళవారం దోమ మండలం కిష్టాపూర్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదోతరగతిలో 10 జీపీఏ సాధించాలని సూచించారు.

చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యం

బంట్వారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేయాలని మర్పల్లి ప్రాజెక్ట్ సీడీపీవో ప్రవీణ అన్నారు. మండల కేంద్రంలో పోషణ మాస ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సూపర్‌వైజర్ ధనలక్ష్మి, విద్యాధికారి చంద్రప్ప ఎంపీడీవో రాములు పాల్గొన్నారు.

పదేళ్లుగా పాట్లు!

అటవీశాఖ కొర్రీతో పూర్తికాని రోడ్డు

న్యూస్‌టుడే, వికారాబాద్ గ్రామీణ:


పెండింగ్‌లో ఉన్న రోడ్డు మార్గం

గ్రామాల మధ్య ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎర్రవల్లి, పుల్‌మద్ది గ్రామాల మధ్యలో మార్గం ఏర్పాటు చేశారు. కానీ 10 ఏళ్లు దాటుతున్నా.. పనులు మాత్రం పూర్తికావడం లేదు. ప్రతి సంవత్సరం పంటల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు, గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుల్‌మద్ది గ్రామానికి వెళ్లే మార్గంలో రైల్వే వంతెన ఉన్నందున గ్రామంలోంచి రైతులు పండించిన పంట, ఇతర పనులకోసం గ్రామానికి ఏవైన తీసుకు వెళ్లాలన్నా.. ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో మరింత ఇబ్బందిగా మారింది. పుల్‌మద్ది గ్రామ రైతులు పత్తి, కూరగాయ, పూలసాగు అధికంగా చేస్తారు. వాటిని మార్కెట్ తరలించే సమయంలో మాత్రం.. నానా అవస్థలు పడాల్సి వస్తుంది. పదేళ్లక్రితం ప్రభుత్వం రూ.1.07 కోట్లతో 2.కిలోమీటర్ల రోడ్డుమార్గం ప్రారంభించారు. పనులు మొత్తం పూర్తవుతాయనుకున్న సమయంలో అటవీశాఖ అధికారులు మోకాలడ్డారు. పుల్‌మద్ది గ్రామ సమీపానికి రాగానే అటవీ భూమిలోంచి రోడ్డు మార్గం వేయరాదని పనులు ఆపేశారు. దీంతో 970 మీటర్ల రోడ్డు పనులు పూర్తి కాక కంకర రోడ్డుపై వెళ్లలేక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రభుత్వమైన మా సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు మంజూరైనా..

– మాజీ సర్పంచ్ మాధవరెడ్డి

గ్రామానికి రోడ్డు మార్గం మంజూరైనా అటవీశాఖ అనుమతి లేక పనులు పూర్తికావడం లేదు. దీంతో పదేళ్లుగా మా సమస్య పరిష్కారం కావడం లేదు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వమైనా మా గ్రామాల మధ్య సమస్య పరిష్కరిస్తే బాగుంటుంది.

అటవీశాఖకు లేఖ రాశాం

– చాణిక్యారెడ్డి, పీఆర్ఏఈ

పుల్‌మద్ది, ఎర్రవల్లి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు విషయమై అటవీశాఖ అనుమతికోసం పలుమార్లు లేఖలు రాయడంతపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. అనుమతులు వస్తేనే మార్గం పూర్తవుతుంది.

రక్తశుద్ధి కేంద్రం.. రోగులకు వరం!

పరిగి వాసుల ముంగిటకు వైద్యం


పరిగిలోని కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులు

న్యూస్‌టుడే, పరిగి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే పరిగిలో గతేడాది డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీంతో ఖరీదైన వైద్యం అందుబాటులోకి రావడంతో పేదలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. పరిగి నియోజకవర్గం అచ్చంగా వ్యవసాయాధారిత ప్రాంతం కావడంతో ఎక్కువగా నిరుపేద కుటుంబాలకు చెందిన వారే ఉన్నారు. వేలకు వేలు ఖర్చు చేసి కొందరు వైద్యానికి దూరంగా ఉండాల్సి వచ్చేది. అలాంటిది ప్రభుత్వాసుపత్రిలో ప్రారంభించడంతో ప్రాణాలను నిలబెట్టుకునేందుకు అవకాశం కలిగినట్లయింది. ఇక్కడ సేవలు మొదలై ఏడాది అవుతున్న నేపథ్యంలో కథనం.

మొన్నటి వరకు ఉస్మానియాకే..

గతంలో ఇలాంటి సమస్యతో బాధపడే వారు నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా అక్కడకు చాలా మంది రావడంతో తమవంతు కోసం రోజుల తరబడి నిరీక్షణ తప్పేది కాదు. దీంతో వారు పడే పాట్లు వర్ణనాతీతం. రెండు రోజుల ముందుగానే వెళ్లి తెలిసిన వారి వద్ద లేదా ఆసుపత్రి పరిసరాల్లోనే నిరీక్షించాల్సి రావడం చికిత్స అనంతరం తిరిగి ఇంటికి రావడం జరుగుతుండేది. ఇలాంటి వారికి అండగా ఉండేందుకు ఏర్పాటు చేసిన కేంద్రంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇది పేదలకు ఎంతో సాంత్వన కలిగిస్తోంది. పరిగి, కుల్కచర్ల, పూడూరు, చౌడాపూర్, దోమ మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా మారింది.

రోజుకు మూడు షిఫ్టులు

ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 8గంటల వరకు మూడు షిఫ్టుల పద్ధతిన రోగులకు రక్తశుద్ధిని చేస్తున్నారు. మొత్తంగా 28మందిలో వారానికి మూడుసార్లు చేసుకునే వారు 22 మంది ఉండగా ఆరుగురు రోగులు రెండు సార్లు వినియోగించుకుంటున్నారు. రోగులకు ఉచిత బస్‌పాస్ సదుపాయంతో ఎంతో ఊరట కలుగుతోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లేందుకు ఖర్చు కూడా లేకపోవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొందరికి పింఛను కూడా అందుతోంది.

రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి: రాములు

నాకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. ఏడాది కాలంగా అవస్థ పడుతున్నా. మా గ్రామానికి 70కి.మీ దూరంలో ఉన్న తాండూరు ఆసుపత్రికి వెళ్లిరావాల్సి వచ్చేది. పరిగిలో ఏర్పాటు కావడంతో కొంత ఇబ్బంది తప్పింది.

రాత్రి 12గంటలకు నా వంతు వచ్చేది: మంజుల

రెండు కిడ్నీలు పాడయ్యాయి. ఆరేళ్లుగా అవస్థలు పడుతున్నా. మా ఊరు నుంచి ఉస్మానియాకు బయల్దేరితే మధ్యాహ్నం చేరుకునేది. నావంతు వచ్చే వరకు అర్ధరాత్రి 12 అయ్యేది. రక్తశుద్ధి ప్రక్రియ పూర్తయ్యే సరికి ఉదయం 4గంటలు పట్టేది. తిరిగి ఇంటికి చేరుకునే సరికి మధ్యాహ్నం అయ్యేది. ఇలా వెళ్లి రావడానికి వేల రూపాయలు అప్పు చేయాల్సి వచ్చింది. బస్సు ఉచితం కావడం, పరిగిలో ప్రారంభించడం సమస్యల నుంచి బయటపడ్డాం.

ప్రమాదవశాత్తు అలుగులో పడి వ్యక్తి మృతి

మోమిన్‌పేట: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి చెరువు అలుగులో పడి మృతి చెందిన సంఘటన రాణా పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఠాణా ఎస్ఐ అరవింద్ తెలిపిన వివరాలు.. టేకులపల్లి గ్రామానికి చెందిన మన్నె రాములు(53) మంగళవారం ఉదయం కూలీ పనికి వెళ్తానని భార్య లక్ష్మికి చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. గ్రామానికి సమీపాన ఆయమ్మకట్ట చెరువు అలుగు దాటుతుండగా ప్రమాదవశాత్తు అలుగులో పడి మృతి చెందాడు. గమనించిన గ్రామస్థులు భార్యకు సమాచారం అందించగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

వికారాబాద్, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో వివాహిత మహిళ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వికారాబాద్ మండలం మదన్‌పల్లిలో మంగళవారం జరిగింది. వివరాలు.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణానికి చెందిన మంగమ్మ(21) తల్లిదండ్రులు బాల్యంలోనే అనారోగ్యంతో మృతి చెందడంతో ఒంటరిగా మిగిలింది. మేనమామ చేరదీసి మదన్‌పల్లికి చెందిన శ్రీకాంత్‌తో మూడేళ్ల కిందట పెళ్లి చేశాడు. వీరికి ఏడాది పాప ఉంది. కొంత కాలంగా అత్తింటి వేధింపులు అధికం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని వికారాబాద్ సీఐ నాగరాజు తెలిపారు.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభలు 24న

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో అక్టోబర్ 24న పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభ ఉంటుందని జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీకాంత్ అన్నారు. స్థానిక వికాస్ జూనియర్ కళాశాల ఆవరణలో స్వర్ణోత్సవ సభకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.